విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకినవలస ఎంపీపీ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బ్యాగులను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే ప్రాథమిక విద్య నాణ్యతగా ఉంటేనే సాధ్యమన్నారు. ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వ స్కూల్‌లను కేరళ రాష్ట్రంలో మాదిరిగా డిజిట లైజేషన్ చేయాలని కోరారు. బట్టి పట్టే చదువులు కాకుండా సృజనాత్మకతతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాగులు ఇస్తున్న వైస్ ఎంపిపి

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- రాజకీయాలకు అతీతంగా పింఛన్ల పంపిణీ
- జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశంలో ఛైర్‌పర్సన్ సుభద్ర
-గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం

మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి అధికారులు తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరం, ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో జరిగాయి. ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్యం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చలు జరిగాయి. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడుకు, శాసనసభ్యులకు జిల్లా పరిషత్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు పలు కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ విషయమై చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. రూ.3 వేలు ఉండే పింఛన్‌ను నూతన ప్రభుత్వం రూ.4 వేలకు పెంపుదల చేయడం హర్షనీయమని అన్నారు. పెంపుదల చేసిన పింఛన్‌ను సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇంటి వద్దే పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ ఫలాల పంపిణీలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి సమాచారం లేకుండా ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల పంపిణీ జరిగేదని, అదే తరహా కొనసాగాలని అధికారులను కోరారు. స్థాయీ సంఘాల సమావేశాలకు కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటివి పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల ఆర్థిక ప్రగతికి అధికారులు కృషి చేయాలని, మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ రహదారులు, విద్యుత్ వంటి వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని అన్నారు. 5 ఏళ్లలోపు పిల్లలు జిల్లాలో లక్షా 38 వేల మంది ఉన్నారని, వారికి అతిసార సోకకుండా ఉండేందుకు ప్రతి ఇంటికీ రెండు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్‌లను ఆశా వర్కర్ల ద్వారా పంపిణీ చేయడమే కాకుండా, సీజనల్ వ్యాధులు సోకాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఛైర్‌పర్సన్‌కు తెలిపారు. అతిసార సోకిన పిల్లల కోసం కెజిహెచ్‌లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, బెడ్లు ఏర్పాటు చేశామని, ఆ బృందం తక్షణమే స్పందించి వైద్యం అందిస్తుందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

అరకు ఎమ్మెల్యేకు సత్కారం

తొలుత అరకు నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగానికి జిల్లా పరిషత్ తరపున అభినందనలు తెలియజేశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

కలెక్టర్ దినేష్ కుమార్

రోగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, బోధనా అసుపత్రి అనుమతుల జారీ చేయడానికి రెండు రోజుల క్రితం నేషనల్ కౌన్సిల్ బృందం పరిశీలించిందన్నారు. జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి 120 పడకల నుండి 420 పడకలకు పెంచడం జరిగిందన్నారు. రెండు అంతస్తులను కార్పోరేట్ స్థాయిలో నిర్మించారని, మంచి నాణ్యత, ఉన్నత స్థాయిలో వైద్య సదుపాయాలు అందనున్నాని తెలిపారు. ఆపరేషన్ ధియేటర్‌కు ఆక్సిజన్ సౌకర్యం కల్పించాలని సూపరింటెండెంట్ కోరారని, ఆ దిశగా ఏర్పాట్లు చేయడానికి కృషి చేస్తామన్నారు. మంజూరైన పోస్టుల సంఖ్యలో ముప్పై శాతం మంది మాత్రమే ఉన్నారని, ఖాళీలు భర్తీ చేయడానికి రీజనల్ డైరెక్టర్ ను కోరతామన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి వచ్చేందుకు వైద్యులు ముందుకు రాలేదని అదనపు ఇన్సెంటివ్ ఇచ్చి నియమిస్తామన్నారు. తాగునీటి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సి. హెచ్.ఓలు) క్యాన్సర్ డైగ్నోసిస్ శిక్షణ పొందుతున్నారని చెప్పారు. ఎక్సరే, సిటి స్కాన్ సేవలు నిరంతరం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హైమావతి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, తహశీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంపిడిఓ సాయి నవీన్, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని, ఆసుపత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల పనులను తనిఖీ

35 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణపు పనులను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం పరిశీలించారు. వైద్య విద్యార్థుల తరగతి గదులు, ల్యాబ్ రేటరీలు, బాలురు, బాలికల వసతి గృహాలు, బోధనా తరగతి గదులు నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణాలను తనిఖీ చేశారు. భవన నిర్మాణాలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, ఏ అవసరం వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. పనులు నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పటిష్టమైన నాణ్యతలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి, తహశీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంపిడిఓ సాయి నవీన్ పాల్గొన్నారు.

ఆయుధాలతో నినాదాలు చేస్తున్న గిరిజనులు

సాగు భూముల జోలికొస్తే తరిమికొడతాం

- గిరిజన రైతుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: తాత ముత్తాతల కాలం నుండి సాగులో ఉన్న తమ భూముల జోలికి వస్తే తరిమి కొడతామని ఆర్మీ మాజీ సైనికులు తక్షణమే వెనక్కి వెళ్లి పోవాలని గిరిజనులు సాంప్రదాయ ఆయుధాలు చేతిలో పట్టుకుని శనివారం సాగు భూమి వద్ద ఆందోళన చేపట్టారు. సాగు భూముల జోలికి వస్తే తరిమి కొడతాం గో బ్యాక్ మాజీ సైనికులు.. సాగులోనున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. మండలంలోని నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయతీ పరిధి సింగవరం గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ ఎరకన్న దొర, .గ్రామ పెద్దలు కె.పోలన్నదొర, కె.పోతన్నదొరలు మాట్లాడుతూ, తాత ముత్తాతల కాలం నుండి భూమిని నమ్ముకుని వివిధ రకాల వ్యవసాయ పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. సర్వే నెంబర్ 22 లో సుమారు 160 ఎకరాలలో 70 మంది రైతులు సాగు చేస్తున్నామని, తాము సాగులో ఉన్న భూమిని మాజీ సైనికులకు పట్టాలు మంజూరు చేశామని సంబంధిత రెవిన్యూ శాఖ అధికారులు, మరోపక్క ఫారెస్ట్ ఉన్నత అధికారులు భూమి ఖాళీ చేయమని లేకుంటే కేసులు బనాయిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు.ఈ భూమి తప్ప మరో ఆధారం తమకు లేదని సంబంధిత అధికారులు పున్ణరాలోచించి సాగులో ఉన్న 70 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఓట్లు వేసి గెలిపించిన ఎంపీటీసీ, సర్పంచులు తమ పక్షాన అండగా నిలవాల్సింది పోయి మాజీ సైనికుల వైపు ఉండటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే రెవిన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని, మాజీ సైనికులు వెనక్కి వెళ్లిపోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాగు రైతులు జమ్మనదొర, పి.పోతన్నదొర, కె.రామన్నదొర, , ప్రసన్నదొర పాల్గొన్నారు.

మొక్కల పంపిణీలో జాప్యం : సిపిఎం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 సంవత్సర కాలంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం ద్వారా రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీలో నిర్లక్ష్యం వహించడం తగదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు తెలిపారు. నాంది సంస్థ పంపిణీ చేస్తున్న మొక్కలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, 2023 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి పథకం కింద మొక్కలు వేసే భూములను జీయో టాగింగ్ చేసి, ఎష్టమేషన్లు వేసి, మొక్కలు నాటుటకు గొయ్యిలు తవ్వించి, నేటికి పంపిణీ చేయక పోవడం అన్యాయమన్నారు. గోతులు తవ్విన ఉపాధి కూలీలకు నేటి వరకు కూలీ చెల్లించలేదన్నారు.ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయుటకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంటే అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా ఉండట సరికాదన్నారు. నాంది సంస్థ రైతులకు సకాలంలో మొక్కలు పంపిణీ చేసిందన్నారు.ఇప్పటికైనా గిరిజన రైతులకు సకాలంలో సిల్వర్ మొక్కలు పంపిణీ చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖా పరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాంది సంస్థ మొక్కలను పరిశీలిస్తున్న సన్నిబాబు

‘ఆశ్రమ’ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఐటిడిఎ పిఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఐటిడీఏ ఆధీనంలో నిర్వహించబడుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు వై.విల్సన్ బాబు ఆధ్వర్యాన శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేత విల్సన్ బాబు మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలు చూపి పని చేసిన కాలానికి జీతాలు, ప్రమోషన్లు నిలుపుదల చేయడం వలన ఉపాధ్యాయులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఊట్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ అప్పర్ ప్రైమరీ స్కూల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.రాముడుకు 2024 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో ముందుగానే సెలవు మంజూరైనా అబ్సెంట్‌గా పరిగణించి ఏడురోజుల జీతం నిలుపుదల చేశారని, ఆయనకు 7రోజుల జీతం తిరిగి చెల్లించాలని కోరారు. గ్రేడ్-2 హెచ్‌ఎమ్ డి.క్షేమాబాయి 2023 ఫిబ్రవరి 1న గిరిజన సంక్షేమశాఖ డీడీకి రిపోర్ట్ చేసి 2023 ఫిబ్రవరి 22 నుండి మార్చి 31 వరకు ఎజిహెచ్‌ఎస్ దామనాపల్లి, ముసినిగుంటలో హెచ్‌ఎమ్‌గా విధులు నిర్వర్తించినప్పటికీ 2023 ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు చెల్లించలేదని, దీని వల్ల రెండు వార్షిక ఇంక్రిమెంట్లు పెండింగ్లో ఉన్నాయని, వాటిని తక్షణమే మంజూరు చేయాలని కోరారు.

గంగవరం మండలం వేములోని ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ పి.నాగమణి వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టిన 8వ రోజులే కాగా, ఒక కేజీ టమోటాలు తక్కువ, కేజీ మినపప్పు ఎక్కువగా ఉండటం కారణం చేత ఆమెకు 15 రోజుల జీతం నిలుపుదల చేశారని, తక్షణమే ఆ జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగుల కోసం రంపచోడవరంలో డిఎస్‌సి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఐటిడిఎ పరిధిలోని గిరిజనుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని కోరారు. రంపచోడవరం మండలం నల్లగొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు నిలుపుదల చేసిన ఏడు రోజుల వేతనం చెల్లించాలన్నారు. ఆశ్రమ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2001 నుండి పనిచేస్తున్న సుమారు 77 మంది అన్‌ట్రెన్డ్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇప్పించాలని కోరారు. అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్లను, ఎఎన్ఎమ్‌లను నియమించి ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు కారం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు విల్సన్‌బాబు తదితరులు

కేన్సర్ నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి

చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

కేన్సర్, నాన్ కమ్యూనికబుల్ జబ్బుల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య అన్నారు. చింతూరు ఐటిడిఎలో డివిజన్‌లోని వైద్యులలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుకు వివిధ రకాల కేన్సర్లపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఇందులో పాల్గొన్న పిఒ చైతన్య మాట్లాడుతూ సమాజంలో బీపీ, షుగర్, కేన్సర్, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు వంటి నాన్ కమ్యూనికబుల్ జబ్బులతో మరణించే వాళ్ల సంఖ్య దాదాపు 60శాతం ఉందని, ఆ మరణాల తగ్గుదల, నియంత్రణకు ప్రతిఒక్కరు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో 30 సంవత్సరాల వయస్సు పైబడిన స్త్రీ, పురుషులను గుర్తించి వారికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా నోటి కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, యోని, గర్భశాయ కేన్సర్లను ముందుగా గుర్తించి, సకాలంలో స్క్రీనింగ్, వైద్య పరీక్షలు చేయించి తగు వైద్యం అందేలా చూడాలని ట్రైనింగ్‌కు వచ్చిన వారికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమణారావు, జ్యోత్స్న, పిహెచ్‌సిల వైద్యాధికారులు, డివిజన్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ఆశ్రమ, గురుకుల విద్యార్థులకు హెల్త్ కార్డులు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా, వైద్యాధికారులు వైద్య సేవలు అందించే విధంగా విద్యార్థులకు ఫొటోతో కూడా హెల్త్ కార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. విద్యార్థులకు హెల్త్ కార్డులు ఏర్పాటు, జిసిసి నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చికెన్, గుడ్లు, పాలు సకాలంలో సరఫరా చేసే విషయంపై శనివారం ఐటిడిఎ పిఒ తన ఛాంబర్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్స్, నేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వర్షాకాలంలో వివిధ రకాల జ్వరాలు రాకుండా ప్రతి ఆశ్రమ పాఠశాలలో దోమలు నివారణకు పంచాయతీ ద్వారా ఫాగింగ్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, తాగునీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు క్లీన్ చేయించాలని సూచించారు. జ్వరం వచ్చిన విద్యార్థులను వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి రక్త పరీక్షలు చేయించి, వారి చేత మందులు వాడించాలన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు ఆహార పదార్థాలు వేడివేడిగా అందించాలన్నారు. జిసిసి ద్వారా నాణ్యత గల నిత్యావసర వస్తువులు సరఫరా జరుగున్నదీ, లేనిదీ పర్యవేక్షించాలని ఆదేశించారు. కోడి మాంసం ఎక్కడి నుండి తీసుకొస్తున్నదీ? ఏ ఫారం నుండి కోళ్లను తెస్తున్నారో నివేదికలు సమర్పించాలన్నారు. కూరగాయల వెండర్లు వారానికి ఎన్ని రోజులు సరఫరా చేస్తున్నదీ? తాజాగా ఉన్నవి సరఫరా చేస్తున్నారా? లేదా? పాలు, గుడ్లు ఏ విధంగా సరఫరా చేస్తున్నదీ ఆరా తీశారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రస్తుతం ఎంతమంది ఉన్నదీ? ఎంతమంది సెలవుల్లో ఉన్నదీ? ఎంతమంది డిప్యూటేషన్లపై ఉన్నదీ? ఆబ్సెంట్ ఎంత మంది ఉన్నదీ? నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కె.సుజాత, రామ తులసి, ప్రసాద్, సూపరింటెండెంట్ బి.కిషోర్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్ బాబు, నాగేంద్ర, వెంకట రాజన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి

రంపచోడవరం నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రంపచోడవరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త విజయభాస్కర్ అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 27న అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్‌ను ఎమ్మెల్యే దంపతులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకువెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సమస్య, నియోజకవర్గంలో రహదారులు ఇతర సమస్యలపై చర్చించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్‌గా వాసుదేవరావు

- పలువురు అధికారుల బదిలీ

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జవహర్ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో విజయవాడ స్టేజ్ వన్ ఎస్‌సిగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవరావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇక్కడి చీఫ్ ఇంజనీర్‌గా ఎపి జెన్‌కో ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత చీఫ్ ఇంజనీర్ జవహర్ మే చివరి వారంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. సుమారు 25 రోజుల పాటు చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తున్నారు. అలాగే ఎపి జెన్‌కో మోతుగూడెం ఓ అండ్ డ్యామ్ ఎస్‌ఇగా ప్రస్తుతం పని చేస్తున్న ఎస్‌హెచ్ మీరాను విజయవాడ ఆర్‌టిపిపికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ ఆర్టీపిపిలో ఈఈగా పనిచేస్తున్న డి.చిన్న కామేశ్వరరావుకు ఉద్యోగోన్నతి కల్పించి ఏపీ జెన్కో ఓ అండ్ డ్యామ్ ఎస్‌ఇగా నియమించారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఇ సివిల్‌గా విధులు నిర్వహిస్తున్న కెకెవి.ప్రశాంత్ కుమార్‌ను విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్‌కు ఎస్‌ఈ సివిల్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విద్యుత్ సౌధలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామభద్రరావుకు పదోన్నతి కల్పిస్తూ సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఇ సివిల్‌గా నియమించారు. ఈ మేరకు వీరంతా నూతనంగా బాధ్యతలు చేపట్టవలసి ఉంది.

రామాలయంలో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో ఉన్న శ్రీసుందర సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో 500 ఏళ్ల చరిత్ర కలిగిన అత్యంత పురాతన ఇత్తటి లోహపు విగ్రహాలను గురువారం రాత్రి అపహరణపై శనివారం పోలీసు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై కె.నాగరాజు ఆధ్వర్యాన పోలీస్ జాగిలాలతో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం సిబ్బంది ఆలయ జూనియర్ అసిస్టెంట్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

4న అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి -గొలుగొండ:కృష్ణదేవిపేట అల్లూరి స్మారక పార్కులోని ఆడిటోరియంలో అల్లూరి చరిత్రను సంబంధించిన అద్భుతమైన చిత్రకళాఖండాలను శాశ్వతంగా ఏర్పాటు చేస్తున్న "అల్లూరి చిత్రకళా మందిరం"ను జూలై 4న ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభిస్తారని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. శనివారం ఆడిటోరియంలో చిత్రపటాలు అమర్చడానికి పడాల వీరభద్రరావు, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్ తదితరుల బృందం అల్లూరి స్మారక పార్కును విచ్చేశారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు అంబటి వరహాల రాజు, పల్లా భాస్కరమణి, లక్ష్మణ బాబ్జి, కార్యవర్గ సభ్యులు పి.ఎస్. రవికాంత్, పంచాద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి –గొలుగొండ:రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం శనివారం తహశీల్దార్ ప్రభాకర్‌రావుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లు రద్దు చేసి అధిక విద్యుత్ ఛార్జీలు తగ్గించాలన్నారు. శాసనసభ సమావేశాలలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదించి రైతులను ఆదుకోవాలన్నారు. కల్తీ విత్తనాలు అరికట్టి వీటిని అమ్మకాన్ని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొనేలా చట్టంలో మార్పులు తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు జి.గురు బాబు, సిపిఐ మండల నాయకులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, లగుడు సత్యనారాయణ, పావాడ ప్రసాద్, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి– చీడికాడ:బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండలంలోని అడ్డూరి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు లెక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన ఉత్తమ విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని ఆయన అన్నారు.

లబ్దిదారులకు నగదు జమ చేయాలి

ప్రజాశక్తి –గొలుగొండ: పెన్షన్ పెంపు, ఒకటవ తేదీనే పంపిణీ చేయాలనే ప్రభుత్వ తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు అన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ రెండవ స్థాయి సంఘం సమావేశంలో గొలుగొండ జడ్పిటిసి గిరిబాబు పలు సమస్యలపై స్పందిస్తూ మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు విడదల చేసిన చేయూత, ఆసరా కొన్ని సంఘాలకు డబ్బు విడదల చేసి కొన్ని సంఘాలకు ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్ జరిగిందన్నారు. ఆయా లబ్దిదారులకు ఇంతవరకు ఆకౌంట్లో సొమ్ము జమ చేయలేదన్నారు. సర్వసభ్యులు, ఎంపీటీసీలను గౌరవిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ జరిగేట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి–నర్సీపట్నంటౌన్: గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాధం కోరారు.స్థానిక ఏరియా ఆసుపత్రిని సిపిఎం నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, జ్వరాలు అరికట్టేందుకు గ్రామాలలో పారిశుధ్యం పై దృష్టి పెట్టి, దోమలను నియంత్రించాలన్నారు. గొలుగొండ మండలం కరకారం, అప్పన్నపాలెం, రొలుగుంట, కోటవురట్ల, కొయ్యూరు మండలాల రోగులు విష జ్వరాలతో బాధపడుతున్నారని, వీరంతా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని తెలిపారు.గ్రామాలలో పారిశుధ్యం లోపించడంతో దోమల బెడద అధికమైందన్నారు.సరైన మంచినీటి సౌకర్యం లేదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తెలుసుకున్నారు. సిపిఎం కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాలలో పారిశుధ్యం, దోమల బెడద నివారణకు ప్రభుత్వం పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు నియమించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు అడిగర్ల రాజు, సాపిరెడ్డి నారాయణమూర్తి, గోవిందరావు, ఈరెల్లి చిరంజీవి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు.గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సర్జన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే ఆసుపత్రిలో చేర్పించి తగిన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలోను వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని సూచించారు. రక్తహీనత, చర్మ వ్యాధులతో బాధపడే వారికి ప్రత్యేకమైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు విధిగా క్షేత్ర పర్యటనలు చేసి నిరంతరం ఆశ్రమ పాఠశాలలను సందర్శించాలని తెలిపారు. విద్యార్థులను ఆసుపత్రికి తరలించి వైద్యం అందించినపుడు తప్పని సరిగా ఒక ఉపాధ్యాయుడు లేదా డిప్యూటీ వార్డెన్ వెంట వెళ్లాలన్నారు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలకు తనిఖీకి వచ్చినపుడు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని చెప్పారు....

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఖర్చుల వివరాలు సమర్పించాలి

పాడేరు: సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో చేసిన ఖర్చులను సంబంధిత రికార్డులలో నమోదు చేసి నియోజక వర్గం వ్యయ పరిశీలకులతో రికన్సిలేషన్ చేసి సమర్పించాలని సూచించారు. వాటిని పూర్తిగా పరిశీలించిన తరువాత ఎన్నికల కమిషన్కు పంపించవలసి ఉంటుందన్నారు. వ్యయ పరిశీలకులు నియోజక వర్గంలో అభ్యర్థులకు లేదా వారి ప్రతినిధులకు అందుబాటులో తగిన విధంగా సహకరించాలని ఆదేశించారు. ఎన్నికలకు నిధుల వివరాలతో ఖర్చులను పక్కాగా అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, ఎన్నికల వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్, నోడల్ అధికారి సువర్ణ ఫణి, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

పాడేరు:సామాజిక పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులతో సమావేశం మయ్యారు. క్షేత్ర స్థాయి పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఎక్కువ, తక్కువ గా పింఛన్లు అందినట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు రూ.7వేల అందించినట్లుగా రశీదు పొందాలని చెప్పారు. ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. పింఛన్ల పంపిణీ జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, డి.ఆర్‌డిఏ. పిడి. మురళి తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుని నియామకం

ఫలించిన సిపిఎం పోరాటం

నూతన ఉపాధ్యాయునితో అధికారులు

ప్రజాశక్తి –అనంతగిరి:వర్షాకాలకు గెడ్డ దాటి రెండున్నర కిలోమీటర్లు దూరం వెళ్లలేమని తమ గ్రామంలోని ఉపాధ్యాయుడిని నియమించాలని సిపిఎం ఆధ్వర్యన విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టెంకలబంధ గ్రామంలో ఉపాధ్యాయుడిని నియమించారు. మండల విద్యాశాఖ అధికారి బాలాజీ మండలంలోని కివర్ల పంచాయతీ పరిధి టెంకలబంధ గ్రామంలో శనివారం పర్యటించారు. గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, టెంకలబంద గ్రామం నుండి సుమారు రెండున్నర కిలోమీటర్లు గంగవరం ఎంపీపీ పాఠశాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో గెడ్డ దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు.గంగవరం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని టెంకలబంధకు కేటాయించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనంకు సంబంధించి గంగవరం పాఠశాల నుండి సరుకులు సరఫరా చేస్తామని, గ్రామస్తులు స్వచ్ఛందంగా వంట చేసి పెట్టాలని సూచించామన్నారు.ఉపాధ్యాయుడి నియామకంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటింటికి చందాలు వేసుకుని రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి నగేష్, బిఎస్ఎన్ పడాల్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో భారీ పేలుడు

- పరుగులు తీసిన సిబ్బంది, గ్రామస్తులు

ప్రజాశక్తి –కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్లో ఆవరణలో గతంలో గంజాయి కేసులో సీజ్ చేసిన కంటైనర్లో భారీ పేలుడు చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ భారీ పేళ్లుల్లు శబ్దాలకు స్టేషన్లో సిబ్బంది భయం తో పరుగులు తీశారు. భారీ శబ్దాలకు గ్రామానికి చెందిన పలువురు స్టేషన్‌కు తరలివచ్చారు. ఏ ఒక్కరు సంఘటన స్థలానికి వెళ్లేందుకు సాహసించ లేదు. 2019లో గంజాయి కేసులో ఈ కంటైనర్ ను సీజ్ చేసి నట్టు కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. పేలుడు కారణం గా కంటైనర్ పూర్తిగా కాలిపోగా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని తెలిపారు. స్టేషన్ భవనానికి ఎటువంటి నష్టం వాటిల్ల లేదని ఎస్ఐ తెలిపారు. మంటలను నర్సీపట్నం అగ్ని మాపక కేంద్రం సిబ్బంది అదుపు చేశారు.పిడుగుపడి కంటైనర్ లో మంటలు వ్యాపించాయని పోలీసులు చెబుతుండగా ఎటువంటి ఉరుములు, మెరుపులు, వర్షం లేకుండా పిడుగు ఎలా పడిందని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి –గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) సహకారంతో శనివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ నేత్ర చికిత్స నిపుణురాలు నికిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిందని నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్ శంకర్ ఫౌండేషన్ ద్వారా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, లావణ్య, వరహాలు, గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి–నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో లక్ష్మణేశ్వర స్వామి (శివాలయం)లో చోడవరం గ్రూపు దేవస్థానాలు ఈవో ఎస్‌వివి సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది మార్చి 24 నుండి ఈ ఏడాది జూన్ 28 వరకు హుండీ ద్వారా రూ.23,835లు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో బివిఎస్ఎస్ మురళికృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మహేష్, సంతోష్, ఆలయ పాలక మండలి తాజా మాజీ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ కొంకిపూడి దొరబాబు పాల్గొన్నారు .

విద్యార్థులకు ఉత్తమ బోధన

ప్రజాశక్తి – చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం శనివారం పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి 2 బివి రమణ హాజరయ్యారు. ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల కె.రామకృష్ణ, సిబ్బంది జిపిఏ నాయుడు, సీఆర్పీ శ్రీను పాల్గొన్నారు

తోటల ధ్వంసం తగదు

ప్రజాశక్తి–నాతవరం:మండలంలోని వీరవరం గ్రామ పంచాయతీ సబ్బవరపు వెంకునాయుడుకు చెందిన జీడి, కొబ్బరి తోటలను గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ధ్వంసం చేయడాన్ని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్ ఖండించారు. పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఇటువంటి చర్యలకు పూనుకోవడం చాలా భాధాకరమన్నారు. సుమారు 5 నుండి 10 మంది వరకు ఈ దుశ్చర్యలో పాల్గొన్నట్లు తాము అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. వ్యక్తులపై కక్షతో ఈ విధంగా చేయడం సరికాదని, ఇటువంటి వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల వైసీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్

ప్రజాశక్తి–నాతవరం:మండలంలోని ఎంబి పట్నంలో పంచాయతీ కార్యదర్శి చినబాబు ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకును శుభ్రపరిచి క్లోరినైజేషన్ చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అపారిశుధ్యంతో దోమలు వ్యాపించి మలేరియా, డెంగీ బారిన పడకుండా ఉండేందుకు ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి

పాఠశాలలను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి – విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి, చింతరేగుపల్లి, అడవి వెంకన్నగూడెం, రామవరం తదితర గ్రామాల్లోని పాఠశాలలను ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. పాఠాలు ఎలా బోధిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. బడిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థుల చదువులు సాగడం లేదని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండటం, కొన్ని బడుల్లో డిప్యూటేషన్ మీద ఒకరే ఉపాధ్యాయులు ఉండటం వలన విద్యా బోధన సక్రమంగా సాగడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, జి.లక్ష్మణరావు, సిరపు తాతబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి – సీలేరు : జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ పరిధి శ్యామగెడ్డ నుంచి తడకపల్లి వరకు గ్రావెల్ రహదారి తక్షణమే పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు కనీసం రహదారి సౌకర్యం కూడా ప్రభుత్వాలు కల్పించలేని దుస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. గిరిజనుల సమస్యలు ప్రభుత్వానికి అధికారులకు రాజకీయ నాయకులకు ఎప్పటికప్పుడు తెలియజేసిన కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. లక్షలాది రూపాయలు ప్రభుత్వం ఖర్చు పెట్టి మారుమూల గిరిజన గ్రామాలకు బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ టవర్లు నిర్మిస్తున్నారు తప్పా గిరిజనుల జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ శ్యామ గడ్డ నుంచి తడకపల్లి వరకు ఒక కిలోమీటర్ మేరకు గ్రావెల్ రోడ్డు పనులు చేసి, మిగతా రహదారిని అసంపూర్తిగా విడిచిపెట్టారని పేర్కొన్నారు. రహదారి సౌకర్యం లేక వైద్య సేవలు, నిత్యావసర సరుకుల కొనుగోలు వంటి వాటికి 13 గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని వాపోయారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద రూ.5 కోట్లు గ్రావెల్ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని, కాని తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. వేసిన మెటల్ రోడ్డుకు రూ.40 లక్షలు డ్రా చేసినట్టు ఆడిట్ లెక్కలు చెబుతున్నాయని, కాని వేసిన కిలోమీటర్ రోడ్డు కూడా నాణ్యత లోపాల వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు గ్రావెల్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు సైతం వెల్లడానికి వీల్లేకుండా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి శ్యామగడ్డ నుంచి తడకపల్లి వరకు గ్రావెల్ రహదారి నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పైపుల లారీ బోల్తా

ప్రజాశక్తి – చింతూరు : ఆంధ్రప్రదేశ్, ఒడిశా రహదారిపై నిమ్మలాగూడెం గ్రామ సమీపంలో మలుపు వద్ద శనివారం సాయంత్రం ఆంధ్రా నుండి ఇనుప పైపుల లోడుతో ఒరిస్సా వైపుకు వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏ విధమైన గాయాలు కాలేదు. ఇదే మలుపు వద్ద అనేక భారీ వాహనాలు గతంలో ప్రమాదాన్ని గురయ్యాయి. ప్రమాద మలుపు కావడంతో తరచూ వాహనాలు ప్రమాదాన్ని గురవుతున్నాయి.

స్పీకర్ స్థానానికి / గౌరవం పెరిగేలా పని చేస్తా : అయ్యన్న

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : స్పీకర్ స్థానానికి మరింత గౌరవం పెరిగేలా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అతి చిన్న వయసులో ఎన్‌టిఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శనివారం తొలిసారిగా విశాఖపట్నానికి విచ్చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ పైమేరకు స్పందించారు. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మరళీకృష్ణ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు విశాల్ గున్ని, మేకా సత్తిబాబు, స్థానిక నేతలు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన నేతలు, అధికారులు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యన్నకు ఘన స్వాగతం పలుకుతున్న నగర ప్రముఖులు

ప్రభుత్వాసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-రంపచోడవరం

గంగవరం మండలం పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యత హామీ ప్రమాణం (ఎన్‌క్యూఎఎస్) సర్టిఫికెట్ వచ్చిందని వైద్యాధికారులు సాయి రతన్, నిహిత శుక్రవారం తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, వైద్య పరికరాలను సక్రమంగా వినియోగించడం, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, తదితర విషయాలను గుర్తించి ఈ పురస్కారం అందజేశారని వెల్లడించారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన

ప్రజాశక్తి – రాజవొమ్మంగి : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని వై.రామవరం ఎంఈఓ కె తాతబ్బాయిదొర అన్నారు. వై.రామవరం మండలం, దేవరమడుగుల ఎంపీపీ పాఠశాల, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలను శనివారం ఎంఈఓ తాతబ్బాయి దొర సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, పాఠశాలల్లో వసతులు, మధ్యాహ్నం భోజనం నిర్వహణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎంఇఒ తాతబ్బాయి దొర

అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి–దేవీపట్నం : దరఖాస్తులు ఇవ్వడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే అధికారులు అందుబాటులో ఉండడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ, తహశీల్దారు కార్యాలయాలకు, ఇందుకూరు గ్రామ సచివాలయానికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తులు ఇవ్వడానికి శనివారం ఆదివాసీ జేఏసీ బృందం వెళ్లింది. ఎంపిడిఒ, తహశీల్దారు, ఇందుకూరు సచివాలయ సెక్రటరీగాని అందుబాటులో లేకపోవడంతో దీంతో డిప్యూటీ తహశీల్దారు పి.రామకృష్ణకు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఎంపిడిఒ, ఇందుకూరు సచివాలయ అధికారులకు ఫోన్ చేసిన స్పందించడం లేదని, దీంతో కిందిస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పించినట్లు చెప్పారు.

ప్రభుత్వ అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో సామాన్య ప్రజలు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా పూర్తి

ప్రజాశక్తి–చింతూరు : పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందించాలని చింతూరు తహశీల్దారు నజీముల్లా షా వీఆర్వోలను ఆదేశించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న ఎఫ్‌పి షాపులలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి? ప్రతి గ్రామంలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? షాపు నుండి ఆయా గ్రామాలకు ఎన్ని కిలోమీటర్లు? వాటికి రోడ్డు మార్గాలు ఉన్నాయా? లేవా? ఇలా అన్ని విషయాలు వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. జులై 1వ తేదీ నుండి రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో విఆర్ఓలు అందరు పాల్గొని, బియ్యం పంపిణీ సక్రమంగా జరిగే విధంగా చూడాలని తహశీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.దేవయ్య, సీనియర్ అసిస్టెంట్ పండా రామకృష్ణ, మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి–రంపచోడవరం : స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రంపచోడవరంలోని రెడ్డిపేట అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం సందర్శించి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వారికి పాఠాలు చెప్పారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో ఆడుతూ పాడుతూ పాఠాలు చెప్పాలని గతంలో అంగన్వాడీ వర్కర్‌గా పని చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని, తద్వారా చదువు, మంచి అలవాట్లు అలవడుతాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికహారం అందుతుందని, దీనితో పిల్లలు చదువుతోపాటు మంచి ఆరోగ్యాన్ని కూడా కలిగి ఉంటారని తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్–522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ